# బతుకూ, భగవంతుడూ, ప్లాస్టిక్ గ్లాసూ!

వ్యాపారానికీ, వ్యభిచారానికీ వినుతికెక్కిన విజయవాడ నగరానికి – నాడీ కేంద్రం అనదగిన – విజయవాడ రైల్వే జంక్షన్. పంపే రైళ్లను పంపుతూ.. వచ్చే రైళ్ళని ఆహ్వానిస్తూ...నిరంతరమూ పెళ్లివారిల్లులా కలకలలాడే ఆ స్టేషను – మానవ జీవన ప్రవంతికి ప్రతీక మాత్రమే కాక చైతన్యానికీ, చిరాకు తెప్పించే గోలకీ కూడా నిలయమే !

రాత్రి... పదకొండు కావొస్తూంది. కొంచెం చలిగా వుంది. దూరాన కనకదుర్గ కాస్సేపు కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకుందామా అని కొంగు పరచుకుంటున్నట్టుంది. ఆరో నంబరు ప్లాట్‌ఫారం, బేరాల మధ్య విరామం దొరికిన వేశ్యలా విశ్రాంతి తీసుకుంటూంది. నిర్జనంగా వుంది దాదాపు. తుఫాన్ వొచ్చే ముందు సముద్రంలాగా రైలు వొచ్చే ముందరి పదిహేను నిముషాల వరకూ ప్రశాంతంగా వుండడం ఆ ప్లాట్‌ఫారాల పరిపాటే.

చిరు చలిలో... విద్యుద్దీపాలు వెచ్చగా వెలుగుతున్నాయి. ఆ వెలుగులూ...ప్రయాణీకుల సౌకర్యార్థం అమర్చబడిన ప్లాస్టిక్ కుర్చీలు మూడింటిలోనూ ఒక దానిలో...సూట్‌వాలా! అతను – రైలుపట్టాల వేపే చూస్తున్నాడు కొన్ని నిముషాల నుంచీ. చూసీ చూసీ విసుగేవొచ్చిందో...ఆ చలిలో వెచ్చదనమే కావాలనిపించిందో ఒక్కసారి లేచి కాఫీ ఫలహారాల విక్రయశాలలోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. అతనికి కొంచం చిత్రంగానూ, చాలా కొత్తగానూ అనిపిస్తూంది – కాగితంలాటి పల్చని ప్లాస్టిక్ గ్లాసులోఆవిర్లు కక్కుతున్న కాఫీని చూస్తుంటే. ఈ ప్లాస్టిక్ సంస్కృతి అతని కాశ్చర్యం కలిగిస్తున్నట్టుంది. ఒకప్పుడు అసంభవమూ అసాధ్యమూ అనిపించిన – 'నీటిని మూటకట్టడం' ని, సాధించిన విజ్ఞాన నాగరికతలు!

పదహారేళ్ళ పాపలో వొచ్చీరానీ యౌవనంలా – పల్చని ప్లాస్టిక్ గ్లాసులో అస్థిరంగా అల్లల్లాడుతున్న వేడివేడి ద్రవం. అతను ఆ కాఫీ సిప్ చేస్తూనే మళ్ళీ రైలు పట్టాల వేపు చూడసాగాడు. ఆ పట్టాలని చూస్తూంటే తన – ఎమ్మే పట్టా, ఎం.కాం.పట్టాలే గుర్తుకొచ్చాయి. రెండు యినుప పట్టాలు పెద్ద రైలుని నడిపించగలవు కానీ రెండు చదువు పట్టాలు జీవితాన్ని నడిపించలేకపోతున్న రోజులయిపోయాయి. అందుకే కాదూ తన జీవితం పట్టాలు తప్పిన రైలుబండి అయింది?

రైలు రావడానికింకా చాలా నిమిషాల వ్యవధి ఉన్నట్లుంది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్ళే గోదావరి ఎక్స్‌ప్రెస్ రావలసి వుంది.

అతను దానిలో ఎక్కడికో వెళ్ళబోతున్నాడని కాదు. రైళ్లు ప్రయాణీకులకే కాదు, ఇంకా చాలా మందికి అత్యవసరాలే. ఎందరి బతుకులో రైళ్ళ రాకపోకల మీద ఆధారపడి వుంటాయ్. ఉదాహరణకి – కాఫీ, ఫలహారాలమ్ముకునేవాళ్లూ, పేపర్ బోయ్‌లు... పెట్టెలు తుడిచి పైసలడుక్కొనే వాళ్లూ...అలాగ. ఆ సూట్‌వాలా ఈ జాబితాలోకి మాత్రం రాడు. కాని – అతనికీ రైలు రావాలి. రైలు కావాలి. రైలు యొక్క – పరుగులిడే చక్రాలు; ప్రవహించే మానవ జీవన వాహినికి ప్రతీకలు మాత్రమే కాదు, ప్రాణ దాతలు కూడా !

కాఫీ ఐపోలేదు. కాని – సిగరెట్ అంటించాడు కోటు జేబులోంచి సిగరెట్, లైటరు తీసి. కాఫీ సిప్‌కీ సిప్‌కీ మధ్య సిగరెట్ పఫ్. వేడి వేడి కాఫీ వెచ్చని సిగరెట్ తోడు. మధ్యే మధ్యే పానీయం; మధ్యే మధ్యే ధూమం. చాలా బాగుంది.

అతను వొంటరిగా వున్నాడు కనుకా... నిరీక్షిస్తున్నాడు కనుకా – సహజంగానే కాలం నెమ్మదిగా నడుస్తోంది. అతను కళ్లు మూసుకుని... కుర్చీలో వెనక్కివాలి... కాఫీ కప్పు చేతిలో వుంచుకునే ఆలోచిస్తున్నాడు. గోదావరిలో తనకి అనువైన వొక్క ప్యాసింజరు తగిలితే... చాలు... కొన్నాళ్లపాటు హాపీగా గడిచిపోతుంది. గోదావరి వొచ్చే సమయానికి... ప్రయాణీకులు నిద్రమత్తుతో ప్రమత్తంగా వుంటారు. గోదావరి, కోణార్క్‌లు ఖరీదైన రైళ్లు. అదృష్టం బాగుండాలే కాని...

కొన్ని ఆలోచనలు అందంగా వుంటాయి – కొన్ని కలలలాగ. వాటి నుంచి బయటకు రావాలని పించదు, మధుశాల నుంచి లాగ.

అతని చేతిలోని గ్లాసులోని కాఫీ ఐపోయిందని అతనికి తెలుసు. కాని – ఎందుకో అతనా ప్లాస్టిక్ గ్లాసుని పట్టుకునే వున్నాడింకా.

"బా...బూ..." వొణుకుతున్న కంఠం. అతను కనులు తెరవలేదు. ఆ కంఠం చాలదూ చూడకుండానే గ్రహించడానికి?

జేబులో చెయ్యిపెట్టి చేతికందిన నాణెం తీశాడు.

"ఇంద–" "వొద్దు బాబూ! నేను ముష్టివాణ్ణి కాను–"

త్రుళ్లిపడి చూశాడతను. షాక్ తగిలినట్లనిపించింది. ముసిలివాడు...జుత్తుపండి..., నడుమువంగి..., ఎముకలకీ చర్మానికీ మధ్య మాంసమే లేని... పొట్ట వెన్నుకంటి... పరమ దరిద్రుడు. మొలకొక గోచీ, భుజాన చిరుగుల సంచీ... చేతిలో ఊతకర్ర.. వొంటి నిండా ముసలితనమూ, పేదరికమూ. ఈ ముసిలాడు ముష్టివాడుకాక మరెవరు? అపియరెన్సెస్ ఆర్ డిసెప్టివ్. నిజమే. అందుకు ఋజువే తను కూడా. కాని... ఈ ముసిలాడు...?

అతని చేతిలో నలుగుతున్న ప్లాస్టిక్ గ్లాసు – రెపరెపలు.

"ఈ ప్లాస్టిక్ గ్లాసులు కొత్తగా వచ్చాయి బాబూ. ఖాళీ కాగానే నలిపి పారెయ్యడమే."

నిజానికి తనకా విషయం తెలియదు. కాని... ఓ ముష్టివాడి ముందు... అనాగరికుడూ, నిరక్షరాస్యుడూ అయిన ఓ ముసిలాడి ముందు తన అమాయకత్వమూ, అజ్ఞానమూ అంగీకరించడానికి అహం అడ్డువొచ్చింది. అబద్ధంతో అభిమానాన్ని రక్షించుకోబోయి–

"నాకు తెలుసులే, నువ్వేమీ చెప్పనక్కర లేదు" అన్నాడు. కొత్తడాక్టరు కంటే పాత పేషెంట్ అనుభవజ్ఞుడే కావొచ్చు. కాని... డాక్టరు డాక్టరే! పేషెంట్ పేషెంటే !!

"మరి – విసిరెయ్యరేం? ఎంగిలి గ్లాసు పట్టుకు కూర్చుంటారేం ఖాళీ అయినా?"

"అది నీకెందుకూ? నా యిష్టం. అయినా నాకు చెప్పడానికి నువ్వెవడివి? ముష్టివాడివి ముష్టివాడిలా వుండు. హద్దుమీరకు–" కోపంగా కసురుకున్నాడు.

ముసిలతను తల వొంచుకున్నాడు. "అంతకోపం దేనికి బాబూ? నేనేం అన్నానని? ఈ ప్లాస్టిక్ గ్లాసులు కొత్తగా రావడంతో... ఖాళీ కాగానే నలిపి పారెయ్యడమే అని చాలా మందికి యింకా తెలియదు..."

"సరేలే... నువ్వెందుకు ఈ గ్లాసు వేపు అలా ఆశగా చూస్తావు? దీనిలో కాఫీ లేదు... పనికిమాలినది..."

"పనికిమాలినది కాదు బాబూ... నాలాటి వాడికి బతుకుతెరువు."

"అంటే..? ఏం చేస్తావు దీన్ని?" ఆశ్చర్యంగా చూశాడు.

"ఇలాటివన్నీ పోగుచేసి కంపెనీకిస్తే వందకి మూడు రూపాయలిస్తారు. అదే నా జీవనాధారం"

కరిగించి మళ్ళీ గ్లాసులు చేస్తారు కాబోలనుకున్నాడతను. "ఆ లెక్కన చూసినా గ్లాసుకి మూడు పైసలే. నేను పావలా యివ్వబోతే వొద్దనేశావు తెలివితక్కువగా" ఎత్తిపొడుస్తున్నట్లే అన్నాడు. అవమానానికి బదులు తీర్చుకుంటున్నట్లే అన్నాడు.

ముసిలతను అదోలా నవ్వాడు. "పావలా కానివ్వండి, రూపాయి కానివ్వండి - ముష్టి ముష్టే. మూడు పైసలే కానివ్వండి ఐదు పైసలే కానివ్వండి సంపాదన సంపాదనే" అతను ఓడిపోదలచుకోలేనట్టుంది. 'ఎలా సంపాదించినా రూపాయి రూపాయే. దాని మీద కష్టపడి సంపాదించామా మరోలా సంపాదించామా అని వుండదు-"

"రూపాయి మీద వుండదు. కాని - మనిషి మనసులో వుంటుంది-" స్థిరంగా అన్నాడు ముసలివాడు.

"అంటే? ఏమిటి నీ ఉద్దేశం?" తెల్లబోయాడతను.

"ఉద్దేశాలూ, సందేశాలూ చెప్పడానికి నేను చదువుకున్నవాణ్ణి కాను బాబూ, నాకు తెలిసినదల్లా నా బతుకూ, భగవంతుడూ, ప్లాస్టిక్ గ్లాసులూ...అంతే. వాటి గురించయితే నాలుగు ముక్కలు చెప్పగలను. మీరు వింటానంటే... విసుక్కోనంటే..."

"చెప్పు" అన్నాడు దయతలుస్తున్నట్టు. రైలు అప్పుడే వొచ్చేట్టు లేదు. వొంటరితనం కంటె - తోడు ముష్టివాడయినా సరే...నయమే కదా.

"నా వయసరవై రెండు బాబూ. ఇద్దరు కొడుకులూ పనిచేసుకుంటూ వాళ్ళ బతుకులు వాళ్లు బాగానే బతుకుతున్నారు."

"నిన్ను ఇంట్లోంచి పొమ్మన్నారా?"

"లేదు నాయనా. నన్ను కూర్చోబెట్టి పోషిస్తామనే అన్నారు. నేనే వొద్దన్నాను."

"అదేం?" తెల్లబోయాడు.

"కొడుకులే అయినా వొకరి దయాదాక్షిణ్యాల మీద ఎందుకు బతకాలి? నేను కష్టమయిన పనులు చేయలేను కానీ - గ్లాసులేరగలనే..."

"కొడుకుల చేత పోషించబడడం - దయాదాక్షిణ్యాలౌతాయా?"

"మంచాన పడితే వేరు. కాలూ చెయ్యీ ఆడుతుంటే...ఊరికే తిని కూర్చోడానికి మనిషికి సిగ్గేస్తుంది. భగవంతుడు - నాలాటి ఎక్కువ ఓపిక లేని ముసిలాడికి కూడా తన తిండి తాను సంపాదించుకో గలిగే తోవ చూపాడు ఈ ప్లాస్టిక్ గ్లాసుల ద్వారా. నేను వీటి నేరితే - ఇక్కడ శుభ్రంగా వుంటుంది; నాకు పొట్ట గడుస్తుంది. శక్తి వుండగా పని చెయ్యకపోవడం నాలాటి వాడికి తప్పే అనిపిస్తుంది. అడుక్కుని, దొంగతనం చేసీ, తేరగా సంపాదించిన సొమ్ము సుఖమిస్తుందేమో

కానీ, తృప్తీ, శాంతీ, గర్వమూ యివ్వదు బాబూ. ఇప్పటికే నేను మిమ్మల్ని విసిగించానేమో. మీరా గ్లాసు పారేస్తే నా దారిన నేను పోతాను–"

అతని చేతిలోంచి ప్లాస్టిక్ గ్లాసు జారిపోవడమేమిటి – ఆ వృద్ధుడు దానిని తీసుకుని భుజాన వున్న సంచీలో వేసుకుని... చేతికర్ర సాయంతో అడుగులు వేయసాగాడు దూరంగా.

సూట్‌వాలా – షాక్ తిన్నట్టే మిగిలిపోయాడు.

దూరంగా ముసిలతను. పట్టాల మీదకు దిగుతున్నాడు. చాలా కష్టపడి – ఎంగిలి ప్లాస్టిక్ గ్లాసుల కోసమే అయివుంటుంది.

'అడుక్కునో, దొంగతనం చేసో తేరగా సంపాదించిన సొమ్ము – సుఖమిస్తుందేమోకాని తృప్తీ, గర్వమూ, శాంతీ యివ్వదు–'

అర్ధరాత్రి... ప్రశాంతతలో ఆ మాటలు... అతనిలో సంఘర్షణ. సత్యాన్ని అర్థం చేసుకోగలుతున్నట్టు... వింత అనుభూతి.

దూరంగా...చీకటి వెలుగుల సంధిలో... నడుము వొంగిన వృద్ధుడు... పట్టాల మధ్య... వొళ్ళు విల్లులా వొంచుతూ... చలిని కూడా ఖాతరు చేయకుండా...స్వతంత్ర జీవన సౌభాగ్యంలోని సంతోషం పొందుతూ... మాయామర్మమూ లేని... నిష్కల్మషమయిన బతుకు బతకడం కోసం... ఎంత కష్టపడుతున్నాడు! నిజంగా – కష్టపడి సంపాదించడంలో అంత ఆనందముంటుందా! ఆ ముసిలతను – మారుతున్న వ్యవస్థనీ, విలువలనీ తిట్టుకోలేదు. ఆ మార్పునే తన జీవన మార్గంగా మలుచుకోగలిగాడు, నిరక్షరాస్యుడే అయినా !

కాని... తను? ప్రకాష్... ఎమ్.ఎ., ఎం.కాం ఉద్యోగం రాలేదని పిక్‌పాకెట్ అయ్యాడు. పైగా అలా సులభంగా సంపాదించడమే తెలివితేటలనుకుంటూ వొచ్చాడు. శక్తిని కాక అదృష్టాన్నారాధించాడు.

నో నెవర్... ఇంక యిలా సాగకూడదు. బిచ్చమెత్తుకోకుండా ఆత్మాభిమానం నిలుపు కుంటున్న ఆ ముసిలతనే తన ఆదర్శం. భిక్షం కంటె తీవ్రమైన నేరం దొంగతనం. ఇకపై దానికి తాను పాల్పడడు.

పనికిమాలినట్లనిపించే – ఎంగిలి ప్లాస్టిక్ గ్లాసు లోంచే ఒక నిరక్షరాస్యుడు జీవనమార్గాన్ని గ్రహించగలిగినప్పుడు... ఇంత సువిశాలమైన ప్రపంచం నుంచి... విద్యావంతుడైన తను... బతుకు బాట చూసుకోలేడూ? అనౌన్స్‌మెంట్...

"విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్ళు గోదావరి ఎక్స్‌ప్రెస్ కొద్ది నిముషాలలో ఆరవ నెంబరు ప్లాట్‌ఫారం పైకి వచ్చును–"

అతనది వినిపించుకోవడం లేదు. స్టేషను బయటకు నడవసాగాడు.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోంచి దిగే ప్రయాణీకులు వారి జేబులలోని పర్సులు... తన అదృష్టం... యివేమీ కాదు అతనాలోచిస్తున్నది. అతని అడుగులు దృఢంగానూ, నిశ్చయంగానూ పడుతున్నాయి. ఎందుకంటే– ఆ అడుగులు – వంచన వేపు కాదు, మంచి వేపు!

సమాజానికి కీడు వేపు కాదు, మేలు వేపు.

అందుకే ఆ అడుగులో అంత శక్తి.

నడుస్తున్నవాడల్లా ఒక్కసారి ఎదురుగా గోడ మీద - దీపాల వెలుగులో స్పష్టంగా పెద్దవిగా కనిపిస్తున్న ఆ మాటలు చదివాడు.

"వర్కీజ్ వర్షిప్ (శ్రమయే ప్రార్థన)"

అతని కనిపించింది... ఆ పల్చని ప్లాస్టిక్ గ్లాసు - పరిశుభ్రతకీ, సౌకర్యానికే కాదు శ్రమజీవన సూత్రానికి కూడా నిలయమే !

☆ ☆ ☆ ☆

# కారాటు

"సార్....."

పేపరు చదువుకుంటున్న శ్రీమంత్ తలతిప్పి అటు చూశాడు.

అహమ్మద్.

నిన్నరాత్రి వరకూ కారు డ్రయివర్.

"మళ్ళీ ఎందుకొచ్చావ్?" కొంచెం కోపంగా చూశాడు శ్రీమంత్.

"క్షమించండి. నేను - మళ్ళీ ఉద్యోగమిమ్మని అడగడానికి మాత్రం రాలేదు-" అన్నాడతను వినయంగానే.

"మరెందుకు వచ్చావ్? నీకు రావలసిన బకాయంతా నిన్ననే యిచ్చెయ్య లేదూ?"

"ఇచ్చేశారు. నిజానికి... నాకు రావలసిన దానికంటె కొద్దోగొప్పో ఎక్కువే యిచ్చారు."

"ఇంకేం?"

"నిన్న రాత్రి జరిగినది..." గొణిగాడహ్మద్.

శ్రీమంత్ చిరాకుగా సోఫాలో వెనక్కి చేరబడ్డాడు - చేదు విషయాన్ని విధి లేక జ్ఞాపకం తెచ్చుకుంటున్నవాడిలా.

నిన్న సాయంత్రం..

కొత్త కారులో...

ఒక వ్యాపారపు పని నిమిత్తం నరసీపట్నం బయలుదేరాడు. కలప కాంట్రాక్టు... సఫలమయితే ఐదారు లక్షల పైచిలుకు లాభం. మంచి ముహూర్తం కుదిరి... కారు బయలుదేరే సరికి... ఆరు దాటింది. చీకటి పడబోతోంది.

రోడ్డు ఏమీ బాగులేదు. దేశ పరిస్థితి లాగానే. ఆర్థిక అసమానతలలా రోడ్డు గోతులమయం.

అయినా కారు వేగం గానూ మెత్తగానే పరుగెడుతోంది.